క్లుప్తంగా

ఘనంగా వన భోజనాలు



మొక్కకు నీరుపోస్తున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: పట్టణంలోని తిమ్మాపురం రోడ్ వద్దనున్న మున్సిపల్ వాటర్‌వర్క్స్ కాంపౌండ్‌లో మున్సిపల్ అధికారులు మంగళవారం కార్తీక వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, కమిషనర్ మల్లికార్జున,, మాజీ చైర్మన్ రామలింగప్ప, పార్టీ యువనేత సిబి.మంజునాథరెడ్డి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని మొక్కలు నాటి నీరు పోశారు.

ఎన్ఎంయూ ధర్నా

గుంతకల్లుటౌన్: ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ నుంచి మినహాయించి సంస్థలో ఇదివరకే ఉన్న పరిమితి లేని వైద్యాన్ని కొనసాగించాలని ఏపీపీటీడీ ఎన్ఎంయూ డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఏఎల్ఎస్.గౌడ్, నటరాజ్ కోరారు. పెండింగ్‌లో ఉన్న 59 డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎన్ఎంయూ నాయకులు డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కమిటీ నాయకుడు ఎస్వై.స్వామి, గ్యారేజీ సెక్రటరీ రమణ, నాగరాజు, హరి, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న గృహ నిర్మాణాలు పూర్తి చేయిస్తాం'



గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ కృష్ణారావు

యాడికి: పిన్నేపల్లె, చందన రహదారిలో జగనన్న లే అవుట్లలో ఆప్షన్-3 కింద నిర్మిస్తున్న ఇళ్లను త్వరగా పూర్తి చేయిస్తామని హౌసింగ్ ఈఈ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు. మంగళవారం వారు లబ్ధిదారులతో సమావేశమయ్యారు. నెలాఖరులోపు ఆప్షన్-3 ఇళ్లను పూర్తి చేయాలని కాంట్రాక్టర్ సుదర్శన్‌రెడ్డికి సూచించారు. హౌసింగ్ ఏఈ ప్రశాంత్ కుమార్, యాడికి ఉప సర్పంచు కాసా చంద్ర మోహన్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ




భూమి పూజ చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కోట వీధి(12వ వార్డు)లో సీసీరోడ్ల నిర్మాణానికి మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు భూమి పూజ చేశారు. రూ.6.50 లక్షలతో సీసీరోడ్లు నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. డీఈ రఘు, ఏఈ సాయి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా, కౌన్సిలర్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నివారణకు చర్యలు

బుక్కరాయసముద్రం: కుష్టువ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని బీకేఎస్ పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్వాతి లక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రభుత్వాసుపత్రిలో కుష్టు నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి లక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో ఈ నెల 27 జనవరి 12వ తేదీ వరకు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. సీహెచ్‌ఓ మోహన్‌కుమార్, పీహెచ్ఎన్ చెన్నమ్మ, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, ఎఎన్ఎంలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు

దుష్ప్రచారం చేసే వారిపై చర్యలు



మాట్లాడుతున్న ప్రమీల

శింగనమల: నియోజకవర్గంలో కొందరు పనిగట్టుకొని వైఎస్సార్‌సీపీ నాయకులపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని, అటువంటి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల హెచ్చరించారు. మంగళవారం శింగనమలలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది వారి స్వలాభం కోసం తమ పార్టీ నాయకులపై ఆధారాలు లేకుండా సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారన్నారు. మరోమారు ఇటువంటి చర్యలకు వారు పాల్పడితే వారిపై కేసులు పెడతామన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పని చేసిన వారికి పదవులు దక్కాయని, కాని కొంత మంది లేని పోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. సమావేశంలో వీరాంజి, మాజీ సర్పంచ్ వెంకటప్ప పాల్గొన్నారు. .

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించండి



యాడికి మండలం ఓబుళాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



కోనుప్పలపాడులో టీడీపీ నాయకులను పార్టీలో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

• ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కోనుప్పలపాడు, ఓబుళాపురం గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో వీధుల వెంట తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల అమలుపై అడిగి తెలుసుకున్నారు. కోనుప్పలపాడు ఎస్సీ కాలనీలో మురుగు సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. జగనన్న లేఅవుట్లో ఇళ్ల పైభాగాన విద్యుత్ వైర్లు పోతున్నాయని లబ్ధిదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగానే, వారం లోపు వాటిని తొలగించాలని విద్యుత్ ఏఈ రాజారావును ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే కోనుప్పలపాడు గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. సమస్యలతో వచ్చే ప్రజలను సచివాలయాల చుట్టూ తిప్పకుండా వెంటనే సమస్యలు తీర్చాలన్నారు. అనంతరం ఆయన అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ నేత కోనా వెంకటశివారెడ్డిని పరామర్శించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

కోనుప్పలపాడు గ్రామంలో టీడీపీకి చెందిన 10 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ నాయకుడు కోనా జగదీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామానికి చెందిన ఓబులేసు, శంకర్, ప్రశాంత్, సుబ్రమణ్య, ఆదం బాబుతో పాటు మరో 5 కుటుంబాల వారికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన చూసి ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరామన్నా రు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ చెన్నప్ప, మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నేత భోగాతి బ్రహ్మానందరెడ్డి, తూట్రాళ్లపల్లె, లక్షుంపల్లె సర్పంచులు సంజీవరాయుడు, పద్మనాభరెడ్డి, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, నాయకులు కోనా జగదీశ్వర రెడ్డి, కోనా దేవనాథరెడ్డి, కోనా మోహన్ రెడ్డి, రవికుమార్ రెడ్డి, కులశేఖర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, బాలగంగయ్య యాదవ్, చంద్ర, జేసీఎస్ మండల కన్వీనర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

తాడిపత్రి అర్బన్: కులమతాలకతీతంగా ఏపార్టీ అని చూడకుండా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందజేస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కోరారు. మంగళవారం ఉదయం స్థానిక 34వ వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి కాలనీ వాసులను ఆప్యాయంగా పలుకరిస్తూ వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు.

అర్హులై ఉండి పథకాలు అందని వారు తన దృష్టికి తీసుకువస్తే వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నాయకులు బాలరాజు, ఆలీ, జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ డీఈ వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి



సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత

బుక్కరాయసముద్రం: గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కొర్రపాడు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించి ఓపీ వివరాలు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న ఆశా డే కార్యక్రమాన్ని పరిశీలించారు. మిషన్ ఇంద్ర ధనుష్, వికసిత్ భారత సంకల్ప యాత్ర, ఎల్‌సీడీసీ సర్వే కార్యక్రమాలపై చర్చించారు. ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులు, బాలింత పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్, సీహెచ్‌ఓ మోహన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ పర్వీన్, సూపర్‌వైజర్ కేశవయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వన్నేదొడ్డిలో కేంద్ర కరువు బృందం పర్యటన



గుత్తిలో నీటి సమస్యను కేంద్ర బృందానికి వివరిస్తున్న నాయకులు

గుత్తి రూరల్: వన్నేదొడ్డి గ్రామంలో మంగళవారం కేంద్ర కరువు బృందం పర్యటించింది. నీతి ఆయోగ్ నుంచి సీనియర్ రీసెర్చ్ అధికారి అనురాధా భట్నా, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ అడ్వైజర్ ఆర్.సంతోష్, ఆహార మంత్రిత్వ శాఖ కార్యాలయ కార్యదర్శి సంజీత్‌కుమార్ ముందుగా రైతు వెంకటేశ్వరి పొలంలో కంది పంటను పరిశీలించారు. అక్కడ రైతుతో ముఖాముఖి మాట్లాడారు. ఎకరా పొలంలో రూ.7 వేలు పెట్టుబడి పెట్టి కంది పంట సాగు చేశానని అయితే 40 కిలోలు మాత్రమే దిగుబడి వచ్చి నష్టపోయానని మహిళా రైతు వెంకటేశ్వరి కేంద్ర బృందానికి వివరించింది. అనంతరం జాతీయ రహదారి పక్కన ఉన్న పెద్దయ్య ఆముదం పంటను వారు చూసి రైతుతో మాట్లాడారు. నాలుగు ఎకరాల్లో ఆముదం పంట సాగు చేశానని ఎకరాకి రూ.22వేలు పెట్టుబడి పెట్టానన్నారు. అయితే కోత సమయంలో ఎకరాకు 40 కిలోలు మాత్రమే దిగుబడి మొత్తం రూ.1.80 లక్షలు నష్టం వచ్చినట్లు రైతు వివరించారు. అనంతరం ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, గుత్తి రూరల్ సచివాల కన్వీనర్ సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో రైతులు వేరుశనగ, ఆముదం, కంది, పత్తి పంటలు సాగు చేసి తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులను కేంద్ర ప్రభుత్వం ఆదుకునేలా నివేదికలు పంపాలని కోరారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తెగదొడ్డి తిమ్మారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 10 శాతం కూడా పంట దిగుబడి రాలేదని అధికారులకు తెలియజేశారు. అనంతరం గుత్తి మునిసిపాలిటీతో పాటుగా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని వన్నేదొడ్డి సర్పంచ్ బేడల లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు హుస్సేన్‌పీరా, గోవర్ధన్‌రెడ్డి, నాయకులు బేడల వెంకట్రాముడు, మల్లయ్యయాదవ్, రామరంగారెడ్డి కేంద్ర బృందానికి వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను వారు పరిశీలించారు. పంటల వారీగా వారు అధికారులతో నివేదికలను స్వీకరించారు. ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి, ఏడీఏ వెంకట్రాముడు, ఏఓ ముస్తాక్ అహ్మద్, హెచ్‌ఓ మిత్రవింద మాధవి, ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు, తహసీల్దార్ మహబూబ్‌బాషా, సీడీపీఓ ఢిల్లేశ్వరి, విద్యుత్ ఏఈ శ్రీకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పవతి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాముయాదవ్, గోపాల్‌రెడ్డి, నారాయణస్వామి, ఓబుళయ్య, బూత్ కన్వీనర్ రంగస్వామి పాల్గొన్నారు.

పామిడి: ఖాదర్‌పేట, అనుంపల్లిలో దెబ్బతిన్న పత్తి, ఆముదం పొలాలను మంగళవారం కేంద్ర బృందం పరిశీలించింది. ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని బాధిత రైతులు జయకృష్ణ, ప్రతాప్‌రెడ్డి కేంద్ర బృందాన్ని కోరారు. అనంతరం కేంద్రం బృందం అనుపంల్లిలో రైతులతో ముఖాముఖీగా మాట్లాడారు. వైస్ ఎంపీపీ కాయల మహేష్, సర్పంచ్ నారాయణస్వామి కరువు పరిస్థితులను కేంద్రబృందం దృష్టికి తెచ్చారు. నోడల్ ఆఫీసర్ ఎల్ఆర్ పుష్పలత, తహసీల్దార్ ఆర్వీ సునితబాయి, గుత్తి ఏడీఏ ఎం వెంకట్రాముడు, ఏఓ డీలీనా వసుంధర, డీటీ జీ లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు కే సుశీలమ్మ, నారాయణస్వామి, మాజీ సర్పంచ్ బయపరెడ్డి, దామోదర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, నాగరాజు, నక్కా ఓబులేసు, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' పోటీలు జయప్రదం చేయండి



కార్యదర్శులకు క్రీడా సామగ్రి అందిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించాలని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు, ఎంఈఓ రవినాయక్ ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాలకు చెందిన వలంటీర్లతో వారు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పాల్గొనేందుకు పేర్ల నమోదుకు బుధవారం వరకూ గడువు ఉందన్నారు. గ్రామీణ యువతీ, యువకులను క్రీడల్లో పాల్గొనేలా పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్లను చేయించాలన్నారు. క్రీడా పోటీలకు అంపైర్లుగా ప్రతి సచివాలయం నుంచి ఇద్దరు వలంటీర్లను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇస్తామన్నారు. క్రీడా పోటీల నిర్వహణలో గ్రామ కార్యదర్శులు ముఖ్యభూమిక పోషించాలన్నారు. అనంతరం ఆడుదాం ఆంధ్రాకు సంబంధించిన క్రీడా సామాగ్రిని 13 సచివాలయాల కార్యదర్శులకు అందజేశారు. ఈఓఆర్డీ ధనలక్ష్మి, కార్యదర్శులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మె



శింగనమల పోస్టాఫీస్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

శింగనమల: తమ సమస్యలు తీర్చాలని గ్రామీణ తపాలా ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం పోస్టాఫీస్ కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా పోస్టల్ ఉద్యోగి అబ్దుల్ నబి మాట్లాడుతూ 8 గంటల పని, పెన్షన్‌తో పాటు అన్ని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో పోస్టల్ ఉద్యోగులు సత్యమూర్తి, కిష్టయ్య, బాలక్రిష్ణరెడ్డి, నరేష్, సాయికుమార్, భాగ్యలక్ష్మి, దీపిక తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని పోస్టల్ సిబ్బంది నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చుకోవడానికి సమ్మె చేస్తునట్లు మంగళవారం పోస్టల్ సిబ్బంది రామకృష్ణారెడ్డి, యేసు, సీతారాముడు తెలిపారు.

గార్లదిన్నె: గార్లదిన్నె, కల్లూరులో మంగళవారం జీడీఎస్ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 8 గంటలు పని, పెన్షన్ ప్రయోజనాలును మంజూరు చేయాలన్నారు. ఉద్యోగులు అరుణ్‌కుమార్, సురేష్ కుమార్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటెలిజెంట్ కంప్యూటింగ్‌పై అవగాహన



ప్రొఫెసర్ అలీ మహమ్మద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండియర్ సీఎస్ఈ, సీఎస్ఎం, సీఎస్‌డీ, విద్యార్థులకు ఇంటెలిజెంట్ కంప్యూటింగ్ కరెంట్ పారాడిగం ఆఫ్ సైన్స్ అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఆర్ఐటీ ఐఐసీ సెల్, ఇంటర్నెట్ సొసైటీ, ఎన్‌డీఎస్ఐ క్లబ్ వారి సహకారంతో జరిగిన కార్యక్రమానికి బెల్గావి విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ అలీ మహమ్మద్ హాజరై మాట్లాడారు. ఇంటెలిజెంట్ కంప్యూటింగ్ కరెంట్ పారాడిగం సంక్లిష్ట ప్రక్రియలను ఆటోమేట్ చేయగలదన్నారు. అవసరాలను అంచనా వేయడం ద్వారా పనికి రాని సమయాన్ని తగ్గించగలదని, మెరుగైన ఖచ్చితమైన నిర్ణయం తీసుకోవచ్చన్నారు. ఉద్యోగి నిర్ణయాలను నాణ్యత ప్రభావం, సృజనాత్మకతను మెరుగు పరచడానికి రిచ్ అనలిటిక్స్, ప్యాటర్న్ ప్రిడిక్షన్ సామర్థ్యాలను మానవ మేధస్సును పెంచుతుందని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, టీపీఓ రంజిత్‌రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ హరి చందన, శిరీష, శ్రీధర్, వీర ప్రకాష్, డాక్టర్ హేమంత్ కుమార్ యాదవ్, డాక్టర్ చిత్ర లింగప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందాం



మహిళతో మాట్లాడుతున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుందామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువ నాయకుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన పట్టణంలోని 33వ వార్డులో పర్యటించారు. స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కేతిరెడ్డి సాయిప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో ఉన్నారన్నారు. ప్రతి కుటుంబంలో సీఎం వైఎస్.జగన్ వెలుగులు నింపారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న జగనన్నను మరోసారి సీఎం చేసుకుందామని కోరారు. నాయకులు పేరం ప్రతాప్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు కోశాధికారి బాబా, సునీల్, బాలరాజు తదితరులు ఉన్నారు.

తాడిపత్రిటౌన్: తేరన్నపల్లిలో ఎమ్మెల్యే తనయుడు యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామ సమస్యలపై ఆరా తీశారు. మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, ఆలూరు రామేశ్వరెడ్డి, సర్పంచ్‌లు వెంకటరామిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, కాశివిశ్వనాథ, పునిత్, సురేష్, రంగనాయకులు, బాబు, సుధా, కేశవరెడ్డి, అంకాల్, హర్షా, టోపీ బాషా, విశ్వనాథ్, రామాంజి, అమరేంద్ర, ఆనంద్, మల్లికార్జున, వేణుగోపాల్‌రెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చిన ఘనత జగనన్నదే



మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు బాబయ్య

తాడిపత్రి అర్బన్: ఎన్నికల హామీలను 99.5 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దూదేకుల బాబయ్య పేర్కొన్నారు. మంగళవారం నందలపాడు సచివాలయం-2 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నందలపాడు సచివాలయం-2 పరిధిలోని ప్రజలకు ప్రభుత్వం ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు రూ.19.65 కోట్లు లబ్ధి చేకూర్చిందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన సీఎం వైఎస్.జగన్‌ను తిరిగి గెలిపించుకుందామని బాబయ్య పిలుపునిచ్చారు. కౌన్సిలర్ పూల రూపా, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు జావిద్‌ఖాద్రీ, నాయకుడు అలీ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

యల్లనూరు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తిమ్మంపల్లి పీహెచ్‌సీ వైద్యులు కీర్తన సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆశావర్కర్లకు యూనిఫాం అందజేశారు. సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణమ్మ, దీనా కుమారి, సూపర్‌వైజర్లు రాము, విజయలక్ష్మి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

యల్లనూరు: మండల కేంద్రంలోని ఎన్‌కె కాలువ రోడ్డులో ఉన్న గంగమ్మ ఆలయంలో మంగళవారం వైభవంగా జాతర నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించి విజేతలైన వృషభాల యజమానులకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.

ట్రేడ్ లైసెన్స్ రుసుం డిజిటల్ పద్ధతిలో చెల్లించండి

తాడిపత్రి అర్బన్: మున్సిపల్ పరిధిలో షాపుల యజమానులు ట్రేడ్ లైసెన్స్ రుసుంను డిజిటల్ పద్ధతిలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ జి.రవి మంగళవారం కోరారు. ఎవరైనా అజ్ఞాత వ్యక్తులు మొబైల్ నంబర్లకు కాల్ చేసి ఫోన్ పే, గూగూల్ పే లేదా నగదు చెల్లించాలని అడిగితే మున్సిపల్ అధికారులకు, వార్డు సచివాలయ కార్యదర్శులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని నవరూప ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామికి అర్చనలు, అభిషేకాలు, ఆకుపూజ చేపట్టారు. ఆంజనేయస్వామి మాలధారులు పురవీధుల్లో భారీ ఊరేగింపు చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగాధర స్వామి, ఆలయ ధర్మకర్త హనుమంతు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సమ్మె చేపట్టారు. సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు.

పుట్లూరు: మండలకేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం ఆవరణలో మంగళవారం అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు ధర్నా చేపట్టారు. కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, సర్వీస్‌లో ఉంటూ మృతి చెందితే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని వారు కోరారు.

పెద్దవడుగూరు: తమ సమస్యలను పరిష్కరించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది రిలే దీక్షలు చేపట్టారు. సీపీఎం నాయకుడు దస్తగిరి తదితరులు మద్దతు తెలిపారు.

శింగనమల: సమస్యలను పరిష్కరించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు భాస్కర్ మద్దతు ప్రకటించారు.

గుత్తి: డిమాండ్లను తీర్చాలని కోరుతూ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద మంగళవారం అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. వీరికి సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మద్దతు పలికారు.

గార్లదిన్నె: అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనం ఇవ్వాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది నిరవధిక సమ్మె చేశారు.

పాముకాటుతో వ్యక్తికి అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డిలో వ్యక్తి పాముకాటుతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బాధితుడు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన శ్రీనివాసులు మంగళవారం గ్రామ శివారులో బహిర్భూమికి వెళ్తుండగా పాముకాటు వేసింది. గమనించిన అతడు ఇంటికి వచ్చి కుటుంబసభ్యులకు విషయం చెప్పాడు. వెంటనే అతడిని గుత్తి ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురం తీసుకెళ్లారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుంతకల్లు రూరల్: దోనిముక్కల, మల్లేనిపల్లిలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణప్ప మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

బలిజల కల్యాణ మండపం నిర్మాణానికి కృషి

బుక్కరాయసముద్రం: బలిజల కల్యాణం మండం నిర్మాణానికి కృషి ఐకమత్యంతో కృషి చేద్దామని బలిజ సంఘం నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బలిజ సంఘం నాయకులు మాట్లాడుతూ నందినేని నాగరాజు 50 సెంట్ల స్థలాన్ని కల్యాణ మండపం నిర్మాణానికి ఇచ్చారన్నారు. కల్యాణ మండపం నిర్మాణానికి రవికాంత్ క్యాటరింగ్ రమణ రూ.20 లక్షలు ఇచ్చేందుకు హామి ఇచ్చారన్నారు. నాయకులు ఆమంచి స్వాములు, పూల నారాయణస్వామి, డాక్టర్ కుప్ప రామాంజినేయులు, ముత్యాల వెంకటేష్, చంద్రోఖర్, వెన్నెల కిషోర్, పరంధామ, రాజు, పూల రంగా తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎల్‌లో సత్తాచాటిన బాలిక



ఉమెన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించిన అభినయ(72)

తాడిపత్రి అర్బన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం జరిగిన ఏపీఎల్ అండర్-16 బాలికల క్రికెట్ పోటీల్లో తాడిపత్రికి చెందిన అభినయ 72 పరుగుతో సత్తాచాటింది. కళ్యాణదుర్గం, తాడిపత్రి జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ ఎంచుకున్న తాడిపత్రి జట్టు 30 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 206 పరుగులు సాధించింది. జట్టులోని అభినయ 72, శ్వేతశ్రీ 27 పరుగులు సాధించారు. ఉమెన ఆఫ్ ది మ్యాచ్‌గా అభినయ నిలిచింది. కళ్యాణదుర్గం జట్టులో బౌలర్ ప్రణీత 3 వికెట్లు తీసింది. కళ్యాణదుర్గం జట్టు బ్యాటింగ్ చేసి నిర్ణీత 30 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 154 పరుగులు సాధించింది. జట్టులో తనుశ్రీ 47 పరుగులు సాధించింది. విజేతలను ఏపీఎల్ రామాంజనేయులు, శ్రీవాణి హైస్కూల్ చైర్మన్ గంగాధర్, పీఈటీ అబ్రహం, ఆర్డీటీ క్రికెట్ కోచ్ భార్గవ్ అభినందించారు.

ఘనంగా చితంబరస్వామి ఊరేగింపు

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని షేక్‌పల్లి గ్రామానికి చెందిన చితంబర స్వామి ఉత్సవ విగ్రహాన్ని భక్తులు మేళ తాళాలతో గ్రామ పురవీధుల్లో మంగళవారం ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.